ప్రజాశక్తి
సోమవారం 01 మే 2023
5
కర్నూలు





ఎమ్మిగనూరు బహిరంగ సభలో నారాలోకేష్, బివిజయనాగేశ్వర్‌రెడ్డి

జన నీరాజనంతో

యువగళం

- సమస్యలపై కుల సంఘాల వినతి
- పాద యాత్రను దిగ్విజయం చేసిన బివి సేన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జన నీరాజనం మధ్య టిడిపి యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముందుకు కొనసాగింది. ఎమ్మిగనూరు పట్టణ శివారులో ఆదివారం ఈఎస్‌వి వే బ్రిడ్జి వద్ద విడిది కేంద్రం నుంచి యువగళం పాదయాత్ర 85వ రోజు ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి నేతృత్వంలో పాదయాత్ర కొనసాగింది. 1088 కిలోమీటర్లకు ఆదివారం యాత్ర చేరుకుంది. పట్టణ శివారులోని అనంతపద్మనాభ స్వామి దేవాలయం వద్ద డ్వాక్రా మహిళలతో నారా లోకేష్ భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. పటణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద స్థానికులతో మాట్లాడగా.. సమస్యలు తెలుపగా మన ప్రభుత్వం వచ్చేదే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లతో సమావేశం : ఎన్‌ఆర్ ఫంక్షన్ హాలు వద్ద కాంట్రాక్ట్ లెక్చరర్లతో నారా లోకేష్ సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టు లెక్చర్ల సమస్యల పరిష్కారానికి విధి విధానాలు ప్రభుత్వం రాగానే అమలు చేస్తామన్నారు.

ఎస్‌సిలతో భేటీ: శ్రీనివాస సర్కిల్‌లో ఎస్సీ సామాజిక వర్గీయులతో భేటీ అయ్యారు. దళితుల దాడులపై పోరాడుతున్నామని, ప్రభుత్వం రాగానే ప్రత్యేక చట్టాలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఉప్పర సమస్యల పరిష్కారానికి కృషి : ఉప్పర వీధిలో ఉప్పర సామాజిక వర్గీయులతో సమావేశం నిర్వహించారు. ఉప్పర సమస్యల పరిష్కారానికి విధి విధానాలు తయారు చేస్తామన్నారు.

వాల్మీకులను ఎస్‌టిలుగా గుర్తిస్తాం : వాల్మీకి సర్కిల్ వద్ద వాల్మీకి బోయలతో భేటీ అయ్యారు. తమ ప్రభుత్వం రాగానే రాష్ట్రంలోని వాల్మీకులు అందరిని ఎస్‌టి గుర్తిస్తామన్నారు.

లోకేష్‌కు ముస్లింలు భారీ గజమాల : సోమప్ప సర్కిల్ వద్ద ముస్లింలతో సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం మైనార్టీ నాయకులు కలీముల్లా తురేగల్ నజీర్ అహ్మద్ డీలర్ మహబూబ్ బాషా, బందే నవాజ్, బడే సాహెబ్ నేతృత్వంలో భారీ గజమాల క్రేన్ సహాయంతో నారా లోకేష్‌కు వేశారు. ఎస్‌బిఐ సర్కిల్ వద్ద స్టూడెంట్ యూనియన్ ప్రతినిధులతో విద్యార్థుల సమస్యలపై నారా లోకేష్‌కు వివరించారు. మోర్ షాపింగ్ మాల్ వద్ద స్థానికులతో సమావేశమయ్యారు.

చేనేతలకు ఉండగా ఉంటాం : వీవర్స్ కాలనీలో చేనేత మహిళ జయ శ్రీనివాసంలో పట్టు చీర మగ్గంపై నేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే బ్లౌజులపై ఎంబ్రాయిడింగ్ విధానాన్ని ఆమె వివరించారు. టిడిపి చేనేత నాయకులు మల్లికార్జున, మిన్నప్ప, మహేష్, దేవేంద్ర, కృష్ణ, నారా లోకేష్‌కు చేనేత సమస్యలపై విన్నవించారు. చేనేత వృత్తిపై జిఎస్టి భారాన్ని ఎత్తివేంచాలని, ముడిసరుకు ధరను తగ్గించాలని, మార్కెటింగ్ సౌకర్యాన్ని పెంపొందించాలని కోరారు. మన ప్రభుత్వం రాగానే తన నియోజకవర్గ మంగళగిరి చేనేత సోదర సమస్యలతో పాటు, సోదరుడు బివి జయ నాగేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలోని చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం వీవర్స్ కాలనీ గ్రౌండ్ నందు బహిరంగ సభ నిర్వహించారు. శివసర్కిల్ వద్ద స్థానికులతో మాటామంతి నిర్వహించారు. శివారు విడిది కేంద్రంలో బస చేశారు.

ఎప్పటికైనా దేశానికి

కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు
- ఆదోనిలో సిపిఎం, సిపిఐ భారీ ప్రదర్శన



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, చిత్రంలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మతోన్మాద బిజెపి గద్దె దింపడమే ప్రధాన కర్తవ్యమని, ఈదేశానికి ఎప్పటికైనా కమ్యూనిస్టులో ప్రత్యామ్నాయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు అన్నారు. మోడీని గద్దె దింపుదాం దేశాన్ని కాపాడుదాం అంటూ ఆదివారం ఆదోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం నుండి భారీ ఎత్తున పీఎం మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ వేదిక వద్దకు ప్రదర్శన చేశారు. సిపిఐ, సిపిఎం ఆదోని డివిజన్ కార్యదర్శిలు సుదర్శన్, లింగన్న అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, వెంకటేశులు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అజయ్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. 2024 ఎన్నికల్లో బిజెపికి పూర్తిస్థాయిలో మెజార్టీ వస్తే రాజ్యాంగాన్ని మార్చుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. హిందూ, ముస్లింలు సోదర భావంతో జీవిస్తున్న ఈ దేశంలో కుల, మతాల మధ్య చిచ్చు రేపి అధికారాన్ని కాపాడుకునే ప్రయత్నంలో మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో బిజెపి నాయకులు వివాదాస్పద వ్యాఖ్యలు చేసినా ఎలాంటి చర్యలు లేవన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు తొలగిస్తామని ఒకరు, అసలు ముస్లిం ఓట్లే తమకు అవసరం లేదని మరొకరు ప్రకటన చేయడం చూస్తుంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. మోడీని ఇంటికి సాగనంపి దేశాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ రాయలసీమ పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం పాటుపడాల్సిన సీఎం జగన్మోహన్ రెడ్డి ఎలాంటి అభివృద్ధికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం రూ. 1642 కోట్లు కేటాయిస్తే నాలుగేళ్లలో కేవలం రూ. 16 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం చూస్తుంటే చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతోందన్నారు. నల్లధనం వెలికి తీసి పేదల ఖాతాల్లోకి రూ. 15 లక్షలు చొప్పున జమ చేస్తామని చెప్పి నమ్మబలికి మోడీ ప్రజలను మోసం చేశారన్నారు. ఏడాది కి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులను మోసం చేశారని దుయ్యబట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెట్టడంలో మోడీకి ఎవరు సాటిరారన్నారు. మోడీ చేస్తున్న అక్రమాలను ఎత్తిచూపకుండా సీఎం జగన్, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మోకరిల్లుతున్నారన్నారు. బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని అన్నారు. వారు చిత్తశుద్ధితో లేకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అజయ్ బాబు మాట్లాడారు. ఈకార్యక్రమ ంలో వామపక్ష పార్టీ నాయకులు నారాయణ, లక్ష్మిరెడ్డి, బసాపురం గోపాల్, మహానంది రెడ్డి, పిఎస్ గోపాల్, ఓబీ నాగరాజు, కుమారస్వామి, విరేష్, తిప్పన, నాగరాజు , వీరేష్, ఉచిరప్ప, శ్రీనివాసులు, సిపిఐ నాయకులు కలుబావి రాజు, వెంకన్న, నర్సప్ప, ఎల్లప్ప, షాబీర్ బాష ఉన్నారు.

టాప్ మోడల్ యూనివర్సిటీగా తీర్చి దిద్దుతాం

- వచ్చే విద్యా సంవత్సరం కొత్త కోర్సులు ప్రారంభం
- కెరియర్ కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు
- క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



క్లస్టర్ యూనివర్సిటీని రాబోయే రోజుల్లో టాప్ మోడల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతాం. యూనివర్సిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే విద్యా సంవత్సరం కొత్త కోర్సులు ప్రారంభానికి కూడా అనుమతులు లభించాయి. డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు హాస్టల్ కూడా మంజూరు అయ్యింది. అని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్ సాయి గోపాల్ అన్నారు. ప్రజాశక్తితో ముఖాముఖిలో క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు.

క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధికి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

విసి: యూనివర్సిటీకి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.1.21 కోట్ల నిధుల బడ్జెట్‌ను కేటాయించింది. యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న పనుల కోసం రూ.7 కోట్లు విడుదల చేసింది. వర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ పురుషుల కళాశాల, కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాల , ని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మూడింటిలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేకంగా ప్రణాళికను రూపొందించాం. జగన్నాథ గట్టులో జరుగుతున్న యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు పూర్తికి దాదాపు రూ. 50 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేందుకు సన్నద్ధమైంది. ఈ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాం. వర్సిటీ అభివద్ధికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రత్యేకంగా దష్టి సారించింది.

వచ్చే ఏడాది ఈ వర్సిటీ పరిధిలో కొత్త కోర్సులను ఏమైనా ప్రవేశపెడుతున్నారా?

విసి: వచ్చే విద్యా సంవత్సరం వర్సిటీలో ఏడు కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఆమోదముద్ర పడింది. నాలుగు సంవత్సరాల కోర్సులను కూడా ప్రవేశపెట్టి విద్యార్థులను వాటిలో అడ్మిషన్లు చేయిస్తున్నాం. ఉత్తమ ప్రమాణాలతో విద్యార్థులకు బోధన చేయడమే తమ లక్ష్యం.

వర్సిటీ పరిధిలో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎప్పుడు చేయనున్నారు?

విసి: ఇటీవలనే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వర్సిటీలో టీచింగ్ , నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆమోదముద్ర వేసింది. ఇందులో భాగంగా 49 టీచింగ్ పోస్టులు , 86 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ఆమోదించింది. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను వర్సిటీకే అప్పగించేలా ఉన్నత విద్యా మండలిని కోరాం. పూర్తిస్థాయిలో మెరిట్ ఆధారంగా పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడతాం. ఎక్కడ అవకతవకలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.

దక్షిణ భారతదేశంలోనే ఏకైక వర్సిటీగా ఏర్పడిన క్లస్టర్ యూనివర్సిటీ ఎందుకు ఉన్నత ప్రమాణాలను అందుకోలేక పోతుంది.? ఉన్నత ప్రమాణాలు అందుకునేలా ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు.



విసి: వాస్తవానికి ఈ వర్సిటీ ప్రత్యేక కేటగిరి స్టేటస్ కింద ఏర్పడింది. ఈ వర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వమే కాకుండా కేంద్రం కూడా ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయనుంది. యూనివర్సిటీ పరిధిలో ఉన్న విద్యార్థులు టీచింగ్ ఫ్యాకల్టీ ఏ వర్సిటీలో లేరు. ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వర్సిటీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి దీనిని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో పెట్టాలనేది అటు ఉన్నత విద్యా మండలి , యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు మూడు కళాశాలను తనిఖీ చేసి అక్కడ విద్యార్థులతో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం. వర్సిటీ పరిధిలోని మూడు కళాశాల అధ్యాపకులను కూడా అభివృద్ధికి సలహాలు సూచనలు ఇవ్వాలని విన్నవించాం. ఇప్పుడు వర్సిటీ పరిధిలో ప్రత్యేకంగా రీసెర్చ్ కమిటీని వేసి పర్యవేక్షిస్తున్నాం

వర్సిటీ నుండి బయటికి వెళ్లిన విద్యార్థులు పోటీ పరీక్షలు ఇతర ఉద్యోగాల ఎంపిక పరీక్షల్లో రాణించలేకపోతున్నారు? దీనిపై మీ స్పందన ఏమిటి

విసి: వర్సిటీ నుండి డిగ్రీ పీజీ పట్టా తీసుకొని వెళ్ళిన విద్యార్థులు అన్ని రకాల పోటీ పరీక్షల్లో ఉద్యోగ నియామక పరీక్షల్లో రాణించేందుకు ప్రత్యేకంగా కెరియర్ కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు ప్రత్యేకంగా ఇలాంటి పరీక్షల్లో రాణించేందుకు అవసరమైన సలహాలు సూచనలను నిష్ణాతులైన అధ్యాపకులను కూడా కేటాయించాం. వర్సిటీ నుండి బయటికి వెళ్లిన విద్యార్థి తప్పనిసరిగా తన భవిష్యత్తును బంగారు బాట వైపు అడుగు పడేలా చూస్తున్నాం.

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

- జూన్ 12న పునః ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి వేసవి సెలవులను విద్యాశాఖ ప్రకటించింది. ఈ వేసవి సెలవులను జూన్ 11వ తేదీ వరకు ఉంటాయని విద్యాశాఖ వెల్లడించింది. తిరిగి పాఠశాలలు జూన్ 12న కొత్త విద్యా సంవత్సరంతో ప్రారంభం కానున్నాయి. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ అన్ని పాఠశాలలు యధావిధిగా పనిచేశాయి. పాఠశాల విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేసిన అనంతరం వారిని పై తరగతులకు ప్రమోట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్మెన్ పోస్టులను కూడా భర్తీ చేసి మే ఒకటో తారీకు నుండి వారిని వీధుల్లోకి తీసుకుంటున్నారు. నాడు నేడు కింద పాఠశాలలో పెద్ద ఎత్తున పనులను చేపట్టడంతో పాఠశాల తరగతి గదుల ప్రాంగణం పర్యవేక్షణ వంటి వాటికోసం నైట్ వాచ్మెన్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు రోజువారీగా శుభ్రపరిచేందుకు ఆయాలు తమ విధులను నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

ఆర్‌టిసి 2 డిపో ఇయు కార్యదర్శి జి.మహేశ్వరరావు



ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కార్మికుల హక్కుల సాధన కోసం ఎపిఎస్‌టిసి కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని మేడే సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ 2 డిపో కార్యదర్శి జి.మహేశ్వరావు కోరారు. పాత పద్ధతిలో ఆర్టీసీ సిబ్బందికి వైద్య సౌకర్యాలు కల్పించాలని,1/2019 సర్క్యులర్‌ను అమలు జరిగే విధంగా చూడాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. పెండింగులో ఉన్న నైట్ అవుట్ అలవెన్సును చెల్లించాలని, మేజర్ యూనియన్లకు గుర్తింపు సంఘాలుగా పరిగణించి సరైన హక్కుల కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.


కర్నూలు డిఎస్‌పిగా విజయశేఖర్



ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నూతన డిఎస్‌పిగా విజయ శేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు నూతన డిఎస్‌పికి ఇదివరకు డిఎస్‌పిగా విధులు నిర్వర్తించిన కెవి మహేష్ పుష్ప గుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. కార్యాలయ సిబ్బంది గౌరవ వందనంతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు శాంతిభద్రతలతో మెలగాలంటే నేరాలు అదుపు కావాలన్నారు. అందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. సంఘవిద్రోహశక్తులపై ఉక్కు పాదం మోపుతానన్నారు. నేరాలను నియంత్రించేందుకు ఉన్నతాధికారుల సహకారంతో తన సిబ్బందికి తగిన సూచనలు సలహాలను అందజేస్తూ సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు.

కార్మిక హక్కుల దీక్షాదినం మేడే

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ఎనిమిది గంటల పనిదినం, శ్రామికవర్గ హక్కులను సాధించుకోవడం కోసం పోరాటాలు చేసి ప్రాణాలను అర్పించిన చికాగో అమ రవీరులకు మేడే 2023 సందర్భంగా సిఐటియు నివాళులర్పిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కార్మిక హక్కుల కోసం పోరాడుతూ ప్రాణాలర్పించిన కార్మికులందరికీ వర్గ దోపిడీ విముక్తి కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన వారికి అందరికీ సిఐటియు శిరస్సు వంచి నివాళులు అర్పిస్తుంది. మేడే సందర్భాన్ని పురస్కరించుకుని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు ప్రజాశక్తితో మాట్లాడారు. ఆయన మాటల్లో....

ఈ ఏడాది మేనాటికి మనదేశంలో మేడే జరుపుకొని వంద సంవత్సరాలు పూర్తి అవుతుంది. 1923 అప్పటి మద్రాసు నగరంలో మెరీనా బీచ్‌లో సింగారు వేలు చెట్టియార్ నాయకత్వంలో ఎర్రజెండాను ఎగరవేశారు. ఆనాటి భారత కార్మిక వర్గ ఉద్యమ మార్గదర్శకులకు సిఐటియు ఘన నివాళులు అర్పిస్తుంది. భారతదేశంలోని శ్రామిక వర్గ ఆధారిత కార్మిక సంఘమైన సిఐటియు ఇంకా నెరవేరని లక్ష్యం అయిన అనాగరిక పెట్టుబడిదారి దోపిడీ నుండి సమాజ విముక్తి కోసం వారి మేడే పోరాట వారసత్వంతో పోరాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్నాం. భారతదేశంలోని పాలకవర్గం దుర్మార్గపు , క్రూరాత్వవ్వ ఎత్తుగడలను ఉవయోగిన్తా కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను హరిస్తున్నది. ఎనిమిది గంటల పని దినం స్థానంలో 12 గంటల పని విధానం అమలు పరచడానికి ప్రభుత్వాలు తహతహలాడుతున్నాయి. భారతదేశం స్వాతంత్రం 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఈ సమయంలో దేశ సార్వభౌమాధికారం భారత ఆర్థిక వ్యవస్థ స్వాలంబన పూర్తిగా పాలక యంత్రాంగం ద్వారా పెట్టుబడిదారీ వర్గంతో పూర్తిగారాజీ పడిందని మనం చూస్తున్నాం పెట్టుబడిదారి వ్యవస్థ సంక్షోభం కొనసాగడం ఆ సంక్షోభం మరింత తీవ్రతరం కావడానికి తోడ్పడుతుంది. జాతీయ స్థాయిలో కార్మికుల సగటు వేతనాల వాటా 30 శాతం నుండి 10 శాతానికి తగ్గింది. పెట్టుబడిదారుల యొక్క లాభం 10 శాతం నుండి 39 శాతానికి పెరిగింది. ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించడానికి కార్మిక వర్గం తీవ్రమైన కృషి చేస్తున్నది.ఏప్రిల్ 5న జరిగిన కిసాన్ సంఘర్ష్ ర్యాలీ కార్మికుల శక్తిని చాటింది. భవిష్యత్తులో దేశభక్తి ఉద్యమాలకు నాంది పలికింది. కర్నూలు జిల్లాలో ఆటో రంగంలోనూ, హమాలి రంగంలోనూ వారి హక్కుల కోసం అనేక పోరాటాలు జరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులకు జరుగుతున్న శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు జరిగాయి. ఆర్‌టిసిలో తీసివేసిన కార్మికులను పనిలో పెట్టేందుకు అనేక ఆందోళనలు జరిగాయి. మార్కెట్ యార్డులో హమాలీల పని భద్రత కొరకు పోరాటాలు చేశాం. జిల్లాలో శ్రమ దోపిడీ కొనసాగుతూనే ఉన్నది గ్రీన్ కో లాంటి పెద్ద సంస్థలలో ఇతర ప్రాంతాల నుండి కార్మికులను తీసుకుని వచ్చి దోపిడీ చేస్తున్నారు. ఉద్యోగ భద్రత లేదు. ప్రాణాలకు రక్షణ లేని పరిస్థితి నెలకొన్నది. వలస కార్మికుల సమస్యలపై ఆందోళన బాట పట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర రంగాలైన అంగన్వాడి, ఆశా, మధ్యాహ్నం భోజనం, విఆర్‌ఎ స్వచ్ఛభారత్ లాంటి రంగాలు , కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధమవుతామని మేడే సందర్భంగా కార్మిక వర్గం ప్రతిజ్ఞ చేయాల్సి ఉంది.



తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఉపయోగం

ప్రముఖ వైద్యులు బిఎల్‌ఎన్. శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ఆత్మరక్షణకు , ఆరోగ్యానికి మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలు ఎంతో అసరమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. కర్నూలు పెద్ద మార్కెట్ కెఎంసి కింగ్ పార్క్ లో లక్ష్మీ కళ్యాణం హాల్లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో టైక్వాండో వేసవి శిక్షణ శిబిరాన్ని డాక్టర్ శంకర్ శర్మ ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి సహకారంతో వేసవి శిక్షణ శిబిరానికి టైక్వాండో నిర్వహించడం అభినందనీ యమన్నారు. ప్రస్తుతం సమాజంలో బాలికల, మహిళల ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలు అవసరమన్నారు. చిన్నప్పటి నుంచి అమ్మాయిలకు క్రీడలపట్ల ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఆత్మ రక్షణకు తోడ్పడే టైక్వాండో క్రీడా ఎంతో అవసర మని క్రమశిక్షణతో నేర్చుకోవడంతో మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుం దన్నారు. ఈ శిక్షణ మానసిక, శారీరక ,ఉల్లాసంతో పాటు విద్య ఉద్యోగాల్లో మెరుగైన అవకాశాలు ఉంటాయన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యా ర్థులు నిమ్మకాయ రసం, మజ్జిగ నీళ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

దుర్భరంగా రజకుల బతుకులు



కర్నూలు కార్పొరేషన్ : నిద్రలేచిన దగ్గర నుంచి పడుకునే వరకు అన్ని పనులకూ స్విచ్ ఆన్ స్విచ్ ఆఫ్ చేస్తే సరిపోతుంది. అమ్మా చాకలి దాన్ని వచ్చాను బట్టలు వేయండి పొద్దుపోయింది అనే మాటలు చెవుల నుంచి దూరం కాకముందే ఇంట్లోకి వాషింగ్ మిషన్ వచ్చి చేరింది. బతుకుదెరువు కోసం పిల్లాపాపలతో పట్నం బయలు ఎల్లింది. అయితే ప్రాచ్చాత్య సాంస్కృతి ఎగబాకి రజకులను నట్టేట ముంచింది. దానికి పాలకుల పాపం మరికొంత తోడైంది ఫలితం చాకిరేవుల కనుమరుగయ్యాయి. ఉన్న కాస్తవృత్తిదారులపై గ్రామ పెత్తందారులు దాష్టికానికి ఒడిగడుతున్నారు. కులవ్యక్షకు గురిచేస్తున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. వెరసి వత్తిదారుల బతుకు దుర్భారంగా మారిందని ఎపి రజక వత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి సి గురుశేఖర్ అన్నారు. ఆయన డిమాండ్స్ ..... గ్రామ బహిష్కరణలు దాడులు అత్యాచారాలు నివారణ కొరకు రాష్ట్ర ప్రభుత్వమే ఎస్‌సిఎస్‌టి తరహాలో సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి.రజక కార్పొరేషన్ కు రూ.1000 కోట్లు నిధులు కేటాయించి కార్పొరేషన్ ద్వారా ప్రతి రజక వత్తిదారునికి బ్యాంకుతో నిమిత్తం లేకుండా 99శాతం సబ్సిడీ రుణాలు ఇవ్వాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటి దగ్గరనే వృత్తి చేసే వారందరికీ 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇవ్వాలి. జగనన్న చేదోడు ఆర్థిక సహాయం ఇంటి దగ్గర వృత్తి చేసే వారందరికీ ఇవ్వాలి.సామాజిక సేవ వృత్తి కనుక కల్లుగీత, చేనేత, మత్స్య కార్మికులకు ఇస్తున్నట్టు రజక వత్తిదారులకు కూడా 50 సంవత్సరాలు నిండినటువంటి ప్రతి వత్తిదారునికి రూ.మూడు వేలు పెన్షన్ మంజూరు చేయాలి అని మేడే సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జెఇఇ మెయిన్స్‌లో నారాయణ కళాశాల ప్రభంజనం

ఆల్ ఇండియా ఓపెన్ లో 5709 ర్యాంకుతో తేజస్విని



విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్ లింగేశ్వర్‌రెడ్డి

కర్నూలు కలెక్టరేట్ : దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జెఇఇ మెయిన్ సెషన్ 2 పరీక్ష ఫలితాలను జాతీయ పరీక్షల మండలి (ఎన్‌టిఎ) శనివారం విడుదల చేసింది. కర్నూలు నారాయణ కళాశాల విద్యార్థులు జెఇఇ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరచి టాపర్లుగా నిలిచారు. ఈద్గా దగ్గరగల నారాయణ కళాశాలలో అభినందన సభలో నారా యణ విద్యాసంస్థల కోర్‌డీన్ పి. లింగేశ్వరరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఫలితాలను వివరించారు. కె. విజయ తేజస్విని 99.52 పర్సంటైల్ తో5709 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు క్యాటగిరి నందు 1160, జె.పవన్ కుమార్ రెడ్డి99.39 శాతంతో 7202 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు 953, షేక్ షారుక్ 99.27 శాతం తో 8584 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరి నందు 1171, కె. సుధీర్ కుమార్ 99.25 శాతంతో 8851 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, క్యాటగిరి నందు 1923, ఎ. అనుగ్య 99.21 శాతంతో 9288 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు క్యాటగిరి నందు 1276, ఇ.హరిణి 99.20 శాతంతో 9422 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరి నందు 2061, బి. రిషింధర్ సింగ్ 99.09 పర్సంటైల్ 10703 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, కె. సాయి శ్రేష్ట 99.00 పర్సంటైల్ 11678 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, కె.అబూబకర్ సిద్దిక్ 98.79 శాతంతో 14233 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరి నందు 2063, బి. మనోజ్ కుమార్ 98.46 శాతంతో 17957 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరి నందు 4378, ఎ.వెంకట సాయి శ్రీ సాహితీ 98.41 పర్సంటైల్ 18504 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరి నందు 2717 ర్యాంకులు వచ్చాయి. అలాగే ఆల్ ఇండియా ఓపెన్ ర్యాం కులో 10,000 లోపు 6, మరియు 20,000 లో పు 11, 30,000 లోపు 17, 40,000 లోపు 24, 50,000 లోపు 28, 60,000 లోపు 33 ర్యాంకులు వచ్చాయి. అంతే కాక దీనితో పాటు వివిధ క్యాటగిరి నందు జి. నరేష్ 49 ర్యాంకు, కె. రాఘవేంద్ర రెడ్డి 74 ర్యాంకు, వై. రాఘ వి 92 ర్యాంకు షేక్ మోహమద్ సమియుల్లా 265 ర్యాంకు, బి. సిరి చెందన 410 ర్యాంకు, కె. రాహుల్ కుమార్ రెడ్డి 465 ర్యాంకు, ఎ.వినయ్ 861 ర్యాంకు, జె. పవన్ కుమార్ రెడ్డి 963 ర్యాం కులు వచ్చాయి. కళాశాల డీన్లు విశ్వనాథ్ రెడ్డి, కె. వెంక టేశ్వర్లు, ప్రిన్సిపల్స్ వేణు గోపాల్ రెడ్డి, విజయ మోహన్, సు జాత, సాంబశివ రెడ్డి , సుధాకర్ రెడ్డి, సూర్య కుమారి, జయ రామి రెడ్డి, అధ్యాపకులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న మంత్రి జయరాం, తదితరులు

సామూహిక వివాహాలు హర్షణీయం

- పాల్గొన్న మంత్రి జయరాం

ప్రజాశక్తి - హాలహర్వి

సామూహిక వివాహాలు హర్షనీయం అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మండలంలోని బల్లూరు గ్రామంలో బల్లూరేశ్వర స్వామి, బీరప్ప స్వామి ఉత్సవం సందర్భంగా ఆదివారం 104 సామూహిక వివాహాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి గుమ్మనూరు జయరాం, టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్చార్జి కోట్ల సుజాతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నూతన వధూవరులను ఆశీర్వదించారు. పేద జంటలకు ఉచిత సామూహిక వివాహ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషదగ్గమని మంత్రి జయరాం అన్నారు. జడ్పీటిసీ లింగప్ప, సిద్దాపురం సర్పంచ్ మారెన్న, వైసీపీ మండల కన్వీనర్ భీమప్ప చౌదరి, కురువ డైరెక్టర్ బజారప్ప, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

దానాల్లో కెల్ల రక్తదానం ఉత్తమం

ప్రజాశక్తి - ఆదోని



రక్త దానం చేసిన దృశ్యం

అన్ని దానాల్లోకెల్ల రక్తదానం ఉత్తమమైందని చర్చి పాస్టర్ సంజయ్, సెక్రటరీ సునీల్ రాజ్ కుమార్, ట్రెజరర్ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సీఎస్ఐ క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం ఇవ్వడం వల్ల అత్యావసర పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాలు కాపాడిన ప్రాణదాతలవుతారన్నారు. 40 మంది రక్తదానం చేయడం జరుగిందని అన్నారు. రక్తదానం చేసిన వారిలో సునీల్ రాజ్ కుమార్, ప్రసాద్, రాజు, జాన్, ఇజ్రాయిల్ రాజు, ఆకాష్, వినయ్, సన్నీ, హరిత, ప్రకాష్, రాజశేఖర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు జోనాథన్, ప్రసాద్, రాజేష్, సౌజన్య, గాయత్రి పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

స్థానిక మంటెస్సోరి ఎ.క్యాంపు స్కూల్ లో ఆదివారం జూనియర్ సాఫ్ట్ బాల్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు హాజరయారు. మే నెల 26 నుంచి 28 వరకు కడప జిల్లా లో జరిగే 10 వ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి జిల్లాకు పేరు ప్రఖ్యతలు తీసుకురావాలని అలంపూర్ జడ్పిటిసి ఇస్మాయిల్ అన్నారు . ఆదివారం జిల్లా స్థాయి జూనియర్ బాల బాలికల సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఇస్మాయిల్ , జిల్లా సాఫ్ట్ బాల్ ఆర్గనైసింగ్ సెక్రటరీ ఎన్.జాకిర్ హుస్సేన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఒరిస్సాలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ బాల బాలికల సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన ఎన్.రవి ని ఈ సందర్భంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి కొమ్మవారి విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఉమా మహేశ్వరి కోశాధికారి అయ్యన్నగౌడ్, ఫీజికల్ డైరెక్టర్ ఎం. శేఖర్ , వ్యాయమ ఉపాధ్యాయులు కె.కల్యాణి, ఇస్మాయిల్, రఘు , సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాభివృద్ధికి సంపూర్ణ సహకారం : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూల స్పోర్ట్స్

కర్నూలు నగరంలో క్రీడల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని కర్నూలు అసెంబ్లీ టిడిపి ఇన్‌ఛార్జి టిజి. భరత్ అన్నారు. నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాసవి బ్యాడ్మింటన్ లీగ్ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు సోమిసెట్టి నవీన్ కుమార్, వాసవి సేవాదళ్ అధ్యక్షులు పాలూరి కిషోర్, కార్యదర్శి లగిశెట్టి కిషోర్, కోశాధికారి మేడం జగదీష్, మాజీ అధ్యక్షులు శేష పని శెట్టి, కమలాపురం సునీల్ తదితరులు పాల్గొన్నారు. టిజి. భరత్ మాట్లాడుతూ నగరంలో వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. స్వతహాగా తాను కూడా బ్యాడ్మింటన్ క్రీడాకారుడినని, సౌత్ జోన్ వరకు బ్యాడ్మింటన్ ఆడానని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడని ఎంచుకొని అందులో రాణించాలని ఆయన సూచించారు. వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాసవి బ్యాడ్మింటన్ లీగ్ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.15000 ద్వితీయ బహుమతిగా పదివేలు తనవంతుగా అందజేస్తానన్నారు. నగరంలో ప్రతి సంవత్సరం పోటీలను నిర్వహిస్తున్న వాసవి సేవాదళ్ ప్రతినిధులను ఆయన అభినందించారు. వాసవి సేవా దళ్ ప్రతినిధులు మాట్లాడుతూ నగరంలో తాము చేపడుతున్న కార్యక్రమాలకు యువనేత టిజి. భరత్ అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వాసవి బ్యాడ్మింటన్ లీగ్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రకటించడం క్రీడల పట్ల ఆయనకున్న ఆసక్తిని తెలియజేస్తుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఆయన సహకారం ఇలాగే ఉండాలని కోరారు.

శ్రీశ్రీ కవిత్వం యువతకు ఆదర్శం

ప్రజాశక్తి-పత్తికొండ

శ్రీశ్రీ కవిత్వం యువకవులకు ఆదర్శమని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ అన్నారు. పత్తికొండ పట్టణంలోశాంతి టాలెంట్ స్కూల్ లో (అరసం) ఆధ్వర్యంలో శ్రీశ్రీ 113వ జయంతి పాఠ శాల ప్రధానోపాధ్యాయులు విజయ లక్ష్మి అధ్యక్షతన జరిగింది. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళలర్పించారు. కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం అభ్యుదయ రచయితలకు ఆదర్శమని, యువకవులకు దిక్సూచి అన్నారు. సామాజిక చైతన్యం కలిగించే సాహిత్యం, శ్రమజీవుల స్వేదాన్ని వివరించే ప్రయత్నం చేశారని అన్నారు. శ్రీశ్రీ ఒక సాహిత్య చైతన్య గీతిక అన్నారు. కార్మిక కర్షక వర్గాలను వెన్ను తట్టి మేలుకో అని విప్లవ మార్గాన్ని, ఉద్యమ మార్గాన్ని పట్టించిన కవిత్వం అని ఆయన వ్యాఖ్యానించారు. శ్రీశ్రీ కవిత్వం నూతన కవులకు మార్గనిర్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, హమీద్, రహమ్ తుల్ల, రంగ నాయకులు, నబి,స్ఫూర్తి, విజయ భారతి, భారతి,ధనలక్ష్మి, రేష్మకళావతి, శ్రీవిద్య, రమాదేవి, సుశీల, సరోజ పాల్గొన్నారు.



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

34 గొర్రెలు మృత్యువాత

- పిడుగుపాటుకు భయపడి గ్రామంలోకి వచ్చిన గొర్రెల కాపరులు

- లబోదిబోమ్మంటున్న గొర్రెల యజమానులు

ప్రజాశక్తి - చిప్పగిరి

శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఉరుము, మెరుపులతో పెద్ద గాలులు వీస్తూ వర్షం ప్రారంభమైంది. నగర డోన పంచాయతీలోని మజార గ్రామమైన తిమ్మాపురం గ్రామ సమీపంలో 34 గొర్రెలు పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాయని కాపరులు తెలిపారు. గొర్రెల కాపరులు సమాచారం మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన కొత్తపేట భీమన్నకు చెందిన 15 గొర్రెలు, తిమ్మాపురం గ్రామానికి చెందిన సీను, జయరాముడు, హుస్సేన్ సాహెబ్, సురేష్‌లకు చెందిన 19 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. కొన్ని జీవాలు వంకలో కొట్టుకుపోగా, మరికొన్ని ఇసుకలో తేలాయి. ప్రభుత్వం దయవుంచి గొర్రెల యజమానులను ఆర్థికంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నపాటి వర్షానికే..

జలమయం



చెరువును తలపించిన మున్సిపల్ రోడ్డు

- ఇబ్బందులు పడ్డ జనం

ప్రజాశక్తి - ఆదోని

చిన్నపాటి వర్షానికే ఆదోని పట్టణంలో నీరు నిలిచి వీధులు చెరువును తలపిస్తున్నాయి. శనివారం రాత్రి సుమారు గంటపాటు వర్షం కురిసింది. నీరు మున్సిపల్ మెయిన్ రోడ్డు గుండా గంటల తరబడి నిలిచి ఉండడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులతోపాటు పాదచారులు ఇబ్బంది లు పడ్డారు. ఖంజన్ రేడియో హౌస్, సురేష్ మెడికల్, మమ్మీ డాడీ షోరూమ్, గురు నానక్ జనరల్ స్టోర్ వద్ద నీరు నిలిచి దుకాణాల్లోకి పొంగిపొర్లి ఉండడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఎండాకాలం లోనే కురిసిన వర్షానికి పరిస్థితి ఇలా ఉంటే వచ్చే వర్షాకాలంలో మరింత గడ్డు పరిస్థితి తప్పదా అంటూ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. **ఏటా నిధులు నీళ్లపాలు :** కాలువలు వెడల్పు, మురుగు తీయడం వంటి దానికోసం మున్సిపాలిటీ నిధుల నుంచి లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. గత ఏడాది సుమారు రూ.60 లక్షలతో కాలువలో పూడిక కోసం ఖర్చు చేసినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు. కాలువలపై మూత వేయరాదని చెబుతున్న మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కొందరు దుకాణా దారులు కాలువలను మూసివేశారు. దీనివల్ల చెత్తాచెదారం పేరుకుపోయి వర్షం నీళ్ళు కాలువల గుండా వెళ్లకుండా రోడ్డుపైకి చేరడంతో చెరువును తలపించే పరిస్థితి దాపురుస్తోంది. గంటల తరబడి నిలుస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్లపై వర్షపు నిలవకుండా కాలువలోకి పొంగి పొరలేలా చర్యలు తీసుకోవాలని పుర వాసులు కోరుతున్నారు.

వర్షపాతం వివరాలు: ఆదోని రెవెన్యూ డివిజన్‌లో ఆదివారం తెల్లవారు జామున 123.2 మిమీ వర్షపాతం నమోదయింది. అధికారులు తెలిపిన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. మంత్రాలయం 10.2, కోసిగి 8.4, కౌతాళం 8.0, పెద్దకడుబూరు 15.2, ఎమ్మిగనూరు 8.6, నందవరం 11.2, గోనెగండ్ల 10.2, ఆదోని 38.2, హొళగుంద 13.2 మిమీ వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. డివిజన్ మొత్త ంగా 123.2 మిమీ కురిసి సగటున 13.7 మిమీ వర్షపాతం నమోదైంది.

కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూనే ఉన్నాము



మురుగు కాలువలపై కట్టడాలు ఉండరాదని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాము. సచివాలయ ఉద్యోగులకు కూడా పర్వేక్షించాలని సూచించాము. మున్సిపల్ మెయిన్ రోడ్ లోని ఇంద్ర భవనం వద్ద మురుగు కాలువకు చెత్తాచెదారము అడ్డుపడకుండా శుభ్రం చేయిస్తూనే ఉన్నాము. రోడ్డుపై మురుగునీరు నిలవకుండా రైతు బజార్, మర్చంట్ క్లబ్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు నిలువ కుండా చర్యలు తీసుకుంటున్నాము. ఇంజనీరింగ్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి ప్రయత్నమయ చర్యలు చేపడతాం.

- రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆదోని.

ఆందోళన నిర్వహిస్తాం



రోడ్డు ఆక్రమణ పేరుతో ఫుట్‌పాతులపై చిరు వ్యాపారులపై మున్సి పల్ అధికారులు ప్రతాపం చూపుతూ తొలగిస్తున్నారు. కాలువలపై బడా బాబులు కట్టడాలు నిర్మించుకున్న తొలగించేందుకు సాహసం చేయలేని పరిస్థితి. దీని కారణంగా రోడ్లపై నీరు కాలువల్లోకి వెళ్ళని పరిస్థితి దీంతో చిన్నపాటి వర్షం వచ్చిన మున్సిపల్ రోడ్డులో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి ఆదోని.

హక్కుల కోసం కార్మికులు పోరాడాలి : సిఐటియు

ప్రజాశక్తి -పెద్దకడుబూరు

అసంఘటితకార్మికుల హక్కు కోసం కార్మికులందరూ ఐక్యంగా పోరా డాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి ఈరన్న అన్నారు. ఆదివారం పెద్దకడబూరులోని ఆర్టిసి బస్టాండ్ అవతారంలో సిఐటియు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగే 137వ మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఎనిమిది గంటలు పని దినాలు సాధించుకోవడాన్ని గుర్తు చేసుకోవడమే మేడే దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పరమేష్ ఆచారి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్గ సభ్యుడు ఉప్పర ఈరన్న, దేవదాసు, వ్యకాసం మండల కార్యదర్శి కల్లుకుంట శీను, ఆటో కార్మికులు రెహమాన్, కార్మికులు పాల్గొన్నారు.



పెద్దకడుబూరు : అభివాదం తెలుపుతున్న నాయకులు

మేడేను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు: మేడేను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు రాముడు, హనుమంతు పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ మేడే దినోత్సవ సందర్భంగా స్థానిక తేరుబజారు నందు గల శ్రీ పద్మశాలి కళ్యాణమండపం నందు సోమవారం ఉదయం 10 గంటలకు మేడే వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పోటీలలో పాల్గొన్న విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు సుందరయ్య స్ఫూర్తి కేంద్రం తరపున అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా నాయకులు రామాంజనేయులు, గోవిందు, స్థానిక నాయకులు హాజరవుతారన్నారు. కార్మికులు, కర్షకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, సర్వజనులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తులకు భోజనశాలలో ఆశ్రయం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీ అన్నపూర్ణ భోజనశాలలో భక్తులకు ఆశ్రయం కల్పించారు. శనివారం రాత్రి 3.30 గంటలకు వర్షం రావడంతో శ్రీ మఠం ఆవరణంలో ఆరు బయట నిద్రిస్తున్న భక్తులను గమనించిన సెక్యూరిటీ సిబ్బంది విషయాన్ని మేనేజర్ యస్కే శ్రీనివాసరావుకు చేరవేశారు. పీఠాధిపతుల ఆదేశాల మేరకు శ్రీ మఠం నిర్వహణలో ఉన్న అన్నపూర్ణ భోజన శాలలో వర్షం నుంచి రక్షణ కల్పించి ఆశ్రయం కల్పించి భక్తుల మన్ననలు పొందారు.

అన్నదానానికి విరాళం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిత్యాన్నాదానానికి ఓ భక్తుడు రూ. 1,01,116లు విరాళంగా ఇచ్చిన్నట్లు శ్రీమఠం మేనేజర్ యస్కే శ్రీనివాస రావు తెలిపారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చెందిన శ్రీ సత్య వెంకట అప్పారావు రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయానికి వచ్చి దర్శన అనంతరం శ్రీ మఠం మేనేజర్ యస్కే శ్రీనివాసరావును కలుసుకుని శ్రీ మఠంలో కొనసాగుతున్న అన్నదానానికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీ మఠం నుంచి శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు పరిమళ ప్రసాదం అందజేశారు.

శ్రీ అన్నపూర్ణ భోజనశాలలో భక్తులకు ఆశ్రయం కల్పించిన దృశ్యం



ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలం పరిధిలో బసరకోడు గ్రామంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, కార్యదర్శి వినోద్ జైన్ తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో షా ప్రేమ్ చంద్ మానాజీ చారిట్రబుల్ ట్రస్ట్, మెడికల్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటే వైద్య శిబిరానికి దాదాపు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 30 మంది దాకా కంటి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఉచితంగా మందులు పంపిణీ, కంటి అద్దాలు అందించారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని రోటరీ క్లబ్ సభ్యుడు కంటి వైద్య నిపుణులు డాక్టర్ రాఘవేంద్రరావు తెలిపారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి భోజన వసతి కూడా కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు భరత్ షా, హితేష్, దీపక్, ఉమేష్ పయి, సాబీర్ అహ్మద్, హుస్సేన్ భాష, షణ్ముఖ, పద్మనాబ్అయ్య, నితిన్, షా శంతిలాల్ తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న నిర్వహకులు, వైద్యులు

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. దోమలు, ఈగలతో సీజనల్ వ్యాధులు సోకె అవకాశం ఉన్న అధికారులు అధికారులు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. బ్లీచింగ్, క్లోరినేషన్, చేయడంలేదు. పారిశుధ్యంపై దృష్టిసారించాల్సిన అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టడంలేదు. ఫలితంగా ఆ ప్రభావం ప్రజల ఆరోగ్యాలపై పడుతోంది. గ్రామీణ పల్లెల్లో మురుగు నీరు రహదారులపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. కోసిగి మండలంలోని కొలమాన్ పేట గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. మురుగు కాల్వలో చెత్తాచెదారం, మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు ఇళ్లలో ఉండలేకపోతున్నారు. మురుగు కాల్వలో పేరుకుపోయిన మురుగు కారణంగా దోమలు విజృంభించి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లో మురుగునీరు పారే డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. కాలువలో పూడిక చేరి డ్రైనేజీ నిర్వాహన అస్తవ్యస్తంగా మారింది. వర్షం కురిస్తేచాలు ఇళ్ల చెంతనే వీధుల్లో మురుగునీరు నిలిచిపోతుంది. దీని ఫలితంగా దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. గ్రామాల వైపు అధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాదిరిగా ఉండడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా మారిన రోడ్డు



2న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భర్తీ చేసిన 98 డిఎస్‌సి పోస్టు నియామకాల్లో ఎక్కడ రిజర్వేషన్ పాటించలేదని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు అన్నారు. మే రెండవ తేదీన కలెక్టరేట్ ఎదుట డిఎస్‌సి అభ్యర్థులతో ధర్నాను చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని డిఎస్‌సి అభ్యర్థులను కోరారు. కలెక్టరేట్లో నష్టపోయిన అభ్యర్థులతో కలిసి ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. డిఎస్‌సి-98 అభ్యర్థుల నియామకంలో కర్నూలు జిల్లాలో తీవ్రంగా అన్యాయం జరిగిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. జిల్లాలో 544 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిపి, ఇందులో 209 పోస్టులు మాత్రమే నియామకం చేశారన్నారు. ఇంకా ఇప్పటికీ 335 పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపిక చేసిన 209 పోస్టుల్లో రిజర్వేషన్ పాటించకుండా ప్రభుత్వానికి తెలియకుండానే మోసం జరిగిందా అని ప్రశ్నించారు. నియామకం జరిపిన 209 పోస్టుల్లో కూడా జిల్లా విద్యాధికారి ప్రకటనలో ఓసి సామజిక వర్గానికి 169 పోస్టులు ఎంపిక చేశారని, దీనివల్ల ఎస్‌సి, ఎస్టీ, బిసి, మైనారిటీ, వికలాంగులకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ప్రశ్నిస్తూ డిఎస్‌సి - 98 అభ్యర్థులకు న్యాయం జరిగేలా మే 2న కర్నూలు కలెక్టరేట్ ముందు జరిగే ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అభ్యర్థి సరోజ మాట్లాడుతూ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో 98 డిఎస్‌సి అభ్యర్థులు వెంకటేశ్వర్లు, సుబ్బన్న, మునిస్వామి, రమేష్, జయన్న కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయమ్మ, ఎన్‌జి.కృష్ణ, జిల్లాసహాయ కార్యదర్శి గురుస్వామి పాల్గొన్నారు.

చినుకు పడితే..

ఇక్కడ చిత్తడే



బురదగా మారిన రోడ్డు

ప్రజాశక్తి -పెద్దకడబూరు

చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతుంది పెద్దకడబూరు గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం. శనివారం రాత్రి పెద్దకడబూరులో ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో పెద్దకడవు ఆర్టీసీ బస్టాండ్ ఆవవరణం కళ్ళకుంట బైపాస్ రోడ్డు చిత్తడిగా మారింది. గుంతల్లో వర్షపు నీరు నిలువ ఉండడంతో అపరిశుభ్రంగా మారింది. బస్టాండ్ ఆవరణం మొత్తం సీసీ రోడ్డు నిర్మించాలని ప్రయాణికులు కోరుకున్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

రాజగోపురం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం రాజగోపురం నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం ఇచ్చిన్నట్లు దేవాలయం సిబ్బంది మల్లికార్జున తెలిపారు. ఆదివారం నాడు కర్నూల్ పట్టణానికి చెందిన నరసింహ ప్రసాద్ తల్లం అండ్ కవిత దంపతులు శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి వారిని దర్శించుకొని, విరాళం అందజేసినట్లు తెలిపారు. దాతల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు శేష వస్త్రాలు దాతలకు అందజేశామన్నారు. పుణ్యక్షేత్రంలో రాజగోపురం నిర్మాణంతో పాటు నిత్య అన్నదానం, అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భక్తులు విరాళాలు అందించాలని కోరారు.



పైపులైను మరమ్మత్తు పనులు చేయించిన కౌన్సిలర్

పైప్‌లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - ఆదోని : ఆదోని పట్టణంలోని కాజీపుర వీధిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టామని అవార్డు కౌన్సిలర్ ఇంతియాజ్ బాష ఆదివారం తెలిపారు. పైపులైనుకు నీరు చేరకపోవడం వల్ల కాలనీలోనే మసీదు వద్ద నివాసాలకు నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. ఈ సమస్యను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అందుకు కావలసిన నిధులు మంజూరుకు అంగీకారం తెలిపారన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరణ చేశామని ఆయన తెలిపారు.





ఆటో యూనియన్ జెండాను ఎగురవేస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు

ఖాతాల్లోకి చేరని 'ఆసరా'

- మంజూరై నెల రోజులైనా పడని నగదు..
- బ్యాంకర్లు, వెలుగు సిబ్బంది చుట్టూ తిరుగుతున్నా స్పందన శూన్యం...



పొదుపు మహిళలకు ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు పరచాల్సిన బ్యాంకర్లు, వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వైఎస్ఆర్ ఆసరా డబ్బులు పొదుపు మహిళల ఖాతాల్లో ఇప్పటికీ జమ కాలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆసరా డబ్బులను గత నెల 2న వారి ఖాతాల్లో జమ చేయాలని స్థానిక శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి రెడ్డి చేతుల మీద మండలంలోని 773 స్వయం సహాయక గ్రూపులకు రూ. 4 కోట్ల 92 లక్షల 941 రూపాయలు చెక్కును విడుదల చేశారు. అయితే మండలంలోని బ్యాంకర్లు, వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు పొదుపు మహిళల ఖాతాలలో జమ కాకపోవడం గమనార్హం. బ్యాంకర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, వెలుగు సిబ్బంది, సెర్ప్ అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు దగ్గర చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తున్నా గ్రామీణ స్థాయిలో మాత్రం అది జరగడం లేదు. బ్యాంకర్లు, వెలుగు సిబ్బంది స్వయం సహాయక గ్రూపుల మహిళలను కించపరిచే విధంగా మాట్లాడడం, జమ చేస్తాంలే ఏమిటి అంత తొందర అంటున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అమలు చేయడంలో నీరుగార్చే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వ్యక్తిగత రుణాలను, జగనన్న తోడు, చేయూత, ఆసరా తదితర పథకాలను పగడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు ఇస్తున్నా కిందిస్థాయి సిబ్బంది, బ్యాంకర్లు మాత్రం పెడచెవిన పెడుతున్నారని స్వయం సహాయక గ్రూప్ మహిళలు వాపోతున్నారు. నెల రోజులవుతున్నా తమ ఖాతాలో ఆసరా డబ్బులు జమ చేయలేదని, దాదాపు 7 నుంచి 8 సార్లు బ్యాంకుల చుట్టూ, వెలుగు సిబ్బంది చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని వారు విమర్శిస్తున్నారు. మండలంలో సంత జుటూరులో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంక్, బండి ఆత్మకూరులో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, ఏ.కోడూరులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈర్నపాడులో బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర బ్యాంకులు ఉన్నా 773 గ్రూపుల ఆసరా డబ్బులు ఇంకా వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామైఖ్య సంఘాల లీడర్లు, పొదుపు మహిళలు వాపోతున్నారు. ఇదే ధోరణి కొనసాగిస్తే బండి ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రజాసంఘాలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తామని మహిళలు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్, డిఆర్డిఏ పిడి స్పందించి స్వయం సహాయక గ్రూపులకు వెంటనే ఆసరా డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని పొదుపు మహిళలు కోరుతున్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- సిఐటియు, ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రస్తుత ప్రభుత్వాలు పోలీసులను ఉపయోగించుకొని ఉద్యమాలను అణిచివేయాలని ప్రయత్నం చేస్తున్నారని, ఉద్యమాలను అరెస్టులతో ఆపలేరని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. మేడేను పురస్కరించుకుని ఆదివారం రుద్రవరంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందున్న ఆటో యూనియన్ (సిఐటియు) జెండా ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణానికి చేరుకున్నారు. అనంతరం కార్మిక కర్షకుల సాంస్కృతిక ఉత్సవాలు, ప్రదర్శనలు, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులను యాజమాన్యాలకు కట్టు బానిసల్లాగా తయారు చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కారు చౌకగా ఆదాని, అంబానీలకు అమ్మివేస్తూ లక్షలాదిమంది ఉద్యోగులను ఇంటికి పంపే ప్రయత్నం చేస్తుందని అన్నారు. కార్మికులంతా ఐక్య ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకట్ మాట్లాడుతూ బిజెపికి కేంద్రంలో అధికారం ఉందనే అహంకారంతో కార్మిక, ఉద్యోగులపైనే దాడి చేయడం మొదలు పెట్టిందని అన్నారు. కవులను, కళాకారులను, పౌరాణిక నాటకాల వారిని, చెక్కభజన, బుర్రకథ లాంటి కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ఆళ్లగడ్డ నాయకులు శంకర్, సురేష్, సుధాకర్, సిఐటియు మండల నాయకులు సుబ్బరాయుడు దస్తగిరిమ్మ, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, బంగారయ్య, వారి మిత్రబృందం పాడిన పాటలు కార్మికులను, ప్రజలను అలరించాయి.



కళారూపాలు ప్రదర్శిస్తున్న బాల బాలికలు

ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి - పర్మినెంట్ చేయాలి
-ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నిత్యం సేవలందించే ఆశా వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం పని భారం తగ్గించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. మే డేను పురస్కరించుకొని ఆదివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. ఆశాల జాబ్ చార్ట్ ప్రకారం కాకుండా వీరికి అనేక రకాల పనులు అప్పగిస్తూ పని భారం పెంచుతుందని తెలిపారు. మెడికల్ కిట్స్, వ్యాక్సిన్ బాక్సులు పీహెచ్సీల నుండి తీసుకొని రావడం, తిరిగి వాపస్ చేయటం లాంటి పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఎన్‌సిడిసి సర్వే ఆశా వర్కర్స్‌తో చేయించరాదని ఉన్నా అదనపు పని చేయిస్తున్నారని చెప్పారు. రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాల్సి ఉండగా ఆశాలే కొనాల్సిన పరిస్థితి ఉందన్నారు. కొనకపోతే ఉద్యోగాల నుండి ఎక్కడ తొలగిస్తారోనన్న భయంతో ఆశాలు ఉంటున్నారని తెలిపారు. సచివాలయాలకు వీరిని అప్పగించాక మరింత పని భారం పెరిగిందన్నారు. రాజకీయ, పని ఒత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు సచివాలయాల్లోనే ఉండాలని నిబంధనలు తొలగించాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్, పిహెచ్‌సిలు, యూహెచ్‌లు ఆశావర్కర్స్‌తో క్లీనింగ్ చేయిస్తూ వారిని ఉద్యోగులుగా కాకుండా స్వీపర్సుగా మారుస్తున్నారని అన్నారు. ఆశా వర్కర్స్‌తో క్లీనింగ్ పద్ధతికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. 104 మొబైల్ క్లినిక్‌లలో కూడా 104 సిబ్బందికి అవసరమైన టీ, టిఫిన్, భోజనం లాంటి ఖర్చులు ఆశా వర్కర్స్‌తో పెట్టించడం దారుణమన్నారు. ఇంత పని భారం ఉన్న ఆశాలకు వేతనాలు నామ మాత్రమే అని, అందుకే వీరికి వేతనాలు రూ. 26 వేలకు చేయాలని, ఆశాలను పర్మినెంట్ చేసి, నియామకాలు ప్రభుత్వమే చేయాలని డిమాండ్ చేశారు. వెట్టి చాకిరీకి లోనవుతున్న ఆశాలకు మాత్రం ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్, మెటర్నిటీ లీవ్స్ ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అదనపు పని, ఖర్చులు ఆశాలతో చేయిస్తున్న ప్రభుత్వం వీరి సమస్యలు పట్టించుకోక పోవడం విచారకరమన్నారు. దీనికి తోడు చాలదన్నట్లుగా పని చేయని సెల్ ఫోన్‌లు ఇచ్చి మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారని, నాణ్యమైన సెల్ ఫోన్స్ ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోగా సొంత ఫోన్‌ల నుండి పని చేయాలని వేధింపులకు గురి చేయడం ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనమన్నారు. తెల్ల పేపర్‌పై ఆశా వర్కర్స్ సంతకం చేయాలని వేధిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మరణించిన ఆశా వర్కర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులు అర్హులైన వారు ఉంటే ఆశా వర్కర్‌గా తీసుకోవాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్, రూ. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సచివాలయానికి ఒక ఆశ వర్కర్‌ని కేటాయించే పద్ధతి ఆపాలన్నారు. రూరల్ ప్రాంతంలో 1000–1200, పట్టణ ప్రాంతాల్లో 2000– 2500 మాత్రమే ఒక్కో ఆశ వర్కర్‌కు జనాభాను కేటాయించాలని, పర్మినెట్ పోస్ట్‌ల భర్తీ సందర్భంగా శిక్షణ పొందిన ఆశాలకు వేయిటేజి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టాప్ మోడల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతాం

- వచ్చే విద్యా సంవత్సరం కొత్త కోర్సులు ప్రారంభం
- కెరియర్ కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు - క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీని రాబోయే రోజుల్లో టాప్ మోడల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతాం. యూనివర్సిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే విద్యా సంవత్సరం కొత్త కోర్సులు ప్రారంభానికి కూడా అనుమతులు లభించాయి. డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు హాస్టల్ కూడా మంజూరు అయ్యింది. అని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్ సాయి గోపాల్ అన్నారు. ప్రజాశక్తితో ముఖాముఖిలో క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు.

క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధికి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

విసి: యూనివర్సిటీకి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.1.21 కోట్ల నిధుల బడ్జెట్‌ను కేటాయించింది. యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న పనుల కోసం రూ.7 కోట్లు విడుదల చేసింది. వర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ పురుషుల కళాశాల, కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాల , ని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మూడింటిలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేకంగా ప్రణాళికను రూపొందించాం. జగన్నాథ గట్టులో జరుగుతున్న యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు పూర్తికి దాదాపు రూ. 50 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేందుకు సన్నద్ధ మైంది. ఈ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాం. వర్సిటీ అభివద్ధికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రత్యేకంగా దష్టి సారించింది.

వచ్చే ఏడాది ఈ వర్సిటీ పరిధిలో కొత్త కోర్సులను ఏమైనా ప్రవేశపెడుతున్నారా?

విసి: వచ్చే విద్యా సంవత్సరం వర్సిటీలో ఏడు కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఆమోదముద్ర పడింది. నాలుగు సంవత్సరాల కోర్సులను కూడా ప్రవేశపెట్టి విద్యా ర్థులను వాటిలో అడ్మిషన్లు చేయిస్తున్నాం. ఉత్తమ ప్రమా ణాలతో విద్యార్థులకు బోధన చేయడమే తమ లక్ష్యం.

వర్సిటీ పరిధిలో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎప్పుడు చేయనున్నారు?

విసి: ఇటీవలనే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వర్సిటీలో టీచింగ్ , నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి ఆమోదముద్ర వేసింది. ఇందులో భాగంగా 49 టీచింగ్ పోస్టులు , 86 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ఆమోదించింది. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను వర్సిటీకే అప్పగించేలా ఉన్నత విద్యా మండలిని కోరాం. పూర్తిస్థాయిలో మెరిట్ ఆధారంగా పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడతాం. ఎక్కడ అవకతవకలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.

దక్షిణ భారతదేశంలోనే ఏకైక వర్సిటీగా ఏర్పడిన క్లస్టర్ యూనివర్సిటీ ఎందుకు ఉన్నత ప్రమాణాలను అందుకోలేక పోతుంది.? ఉన్నత ప్రమాణాలు అందుకునేలా ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు.

విసి: వాస్తవానికి ఈ వర్సిటీ ప్రత్యేక కేటగిరి స్టేటస్ కింద ఏర్పడింది. ఈ వర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వమే కాకుండా కేంద్రం కూడా ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయనుంది. యూనివర్సిటీ పరిధిలో ఉన్న విద్యార్థులు టీచింగ్ ఫ్యాకల్టీ ఏ వర్సిటీలో లేరు. ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వర్సిటీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి దీనిని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో పెట్టాలనేది అటు ఉన్నత విద్యా మండలి , యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు మూడు కళాశాలను తనిఖీ చేసి అక్కడ విద్యార్థులతో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం. వర్సిటీ పరిధిలోని మూడు కళాశాల అధ్యాపకులను కూడా అభివృద్ధికి సలహాలు సూచనలు ఇవ్వాలని విన్నవించాం. ఇప్పుడు వర్సిటీ పరిధిలో ప్రత్యేకంగా రీసెర్చ్ కమిటీని వేసి పర్యవేక్షిస్తున్నాం





వర్సిటీ నుండి బయటికి వెళ్లిన విద్యార్థులు పోటీ పరీక్షలు ఇతర ఉద్యోగాల ఎంపిక పరీక్షల్లో రాణించలేకపోతున్నారు? దీనిపై మీ స్పందన ఏమిటి

విసి: వర్సిటీ నుండి డిగ్రీ పీజీ పట్టా తీసుకొని వెళ్ళిన విద్యార్థులు అన్ని రకాల పోటీ పరీక్షల్లో ఉద్యోగ నియామక పరీక్షల్లో రాణించేందుకు ప్రత్యేకంగా కెరియర్ కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు ప్రత్యేకంగా ఇలాంటి పరీక్షల్లో రాణించేందుకు అవసరమైన సలహాలు సూచనలను నిష్ణాతులైన అధ్యాపకులను కూడా కేటాయించాం. వర్సిటీ నుండి బయటికి వెళ్లిన విద్యార్థి తప్పనిసరిగా తన భవిష్యత్తును బంగారు బాట వైపు అడుగు పడేలా చూస్తున్నాం.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి

వివాహ వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : మండలంలోని యర్రగుడి గ్రామంలో ఆదివారం జరిగిన పోలు వెంకటేష్ వివాహ వేడుకలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి యువజన నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డిలు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎర్రగుడి మాజీ సర్పంచ్ యాపర్ల వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ కంబగిరి స్వామి, కలవటాల తిమ్మారెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ స్పందన తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నేడు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే పోలీసు స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల తాత్కలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో వచ్చే అర్జీదారులు గమనించి రావొద్దని తెలిపారు. అయితే జిల్లాలోని మిగతా అన్ని పోలీసు స్టేషన్‌లలో, డిఎస్‌పి కార్యాలయాలలో పోలీసు స్పందన కార్యాక్రమం జరుగుతుందని తెలిపారు.

3 నుండి తిరు కళ్యాణ మహోత్సవాలు

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలో వెలసిన భూలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో తిరు కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 3 నుండి ప్రారంభమవుతున్నట్లు గ్రామ రైతు సంఘం పెద్దలు ఆదివారం తెలిపారు. పెద్దలు మాట్లాడుతూ 3న రాత్రి సంకల్పం, పుణ్యావచనం, ధ్వజారోహణం, అంకురార్పణ, మత్స్య గ్రహణం, కలశ స్థాపన, 4న తెల్లవారుజామున 4:50 నిమిషాలకు స్వామి అమ్మవార్ల తిరు కళ్యాణం, రాత్రి హనుమ వాహనం, 5న సింహ వాహనం, 6న శేష వాహనం, 7న గరుడ వాహనం, 8న గజవాహన సేవలు జరుగుతాయని తెలిపారు. 9న సాయంత్రం గ్రామ పురవీధులలో రథోత్సవం, 10న మండపం వీధి నుండి చెన్నకేశవ స్వామి ఆలయం వరకు తిరు రథోత్సవం జరుగునని చెప్పారు.

10వ తేదీన రాతి దూలం పందెం పోటీలు : తిరు కళ్యాణ మహోత్సవాలలో భాగంగా ఈ నెల 10న ఉదయం ఏడు గంటలకు న్యూ కేటగిరి విభాగం రాతి దూలం పందెం పోటీలను వైసిపి నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.80 వేలు, రెండో బహుమతి రూ.60 వేలు, మూడో బహుమతి రూ.40 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ. 5 వేలు తన సొంత ఖర్చులతో అందిస్తున్నట్లు తెలిపారు.

వైసిపి నుండి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - డోన్

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమనే నమ్మకంతో ఆదివారం డోన్ మండలం దొరపల్లె గ్రామానికి చెందిన 53 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపి డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి సమక్షంలో కర్నూలులోని టిడిపి కార్యాలయంలో చేరారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఆంధ్ర రాష్ట్రం అంధకారం అయిందన్నారు. రాష్ట్రంలో సామాన్య ప్రజలు బతకడమే కష్టంగా మారిందని అన్నారు. నేడు యువత ఉద్యోగ అవకాశాలు లేక వేరే రాష్ట్రాలకు వలసలు పోతున్నారని తెలిపారు. అనంతరం వైసిపి నుండి టిడిపిలోకి చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, అధికార ప్రతినిధి విజయ్ భట్, మండల అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్, జిల్లా కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు, బిసి కమిటీ నాయకులు మల్లెంపల్లె జయ్యన్న, క్లస్టర్ ఇంచార్జ్ మిద్దపల్లె గోవిందు, బంకు శ్రీనివాసులు, బాలశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ కేశవయ్య గౌడ్, సుధాకర్, నాగరాజు, రవి కుమార్, బాలమద్ది, కొండన్న, కోదండరాముడు తదితరులు పాల్గొన్నారు.



గౌరు వెంకటరెడ్డి సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలోకి చేరుతున్న దొరపల్లె గ్రామస్తులు

నేటి నుండి షటిల్ బ్యాడ్మింటన్ ఉచిత వేసవి శిక్షణ

ప్రజాశక్తి - డోన్

షటిల్ బ్యాడ్మింటన్ ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంపు డోన్ శ్రీబుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 1 నుంచి నిర్వహిస్తున్నట్లు డోన్ మున్సిల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ డోన్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమ్మర్ ఫ్రీ షెటిల్ బ్యాడ్మింటన్ కోచింగ్ అబ్బాయిలు, అమ్మాయిలకు నేటి నుండి జూన్ 10 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల అమ్మాయిలు, అబ్బాయిలు ఉచితంగా నిర్వహించే కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం 9 గంటలకు బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో సమ్మర్ ఫ్రీ షటిల్ బ్యాడ్మింటన్ ప్రారంభిస్తున్నామన్నారు. ఔత్సాహికులు, సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.



చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజా సేవలోనే ఆత్మ సంతృప్తి

ప్రజాశక్తి-డోన్

సమాజ సేవ చేయడంలోనే నిజమైన ఆత్మసంతృప్తి ఉంటుందని ప్రార్థన సమయం నిర్వాహకులు జాన.ప్రభాకర్ అన్నారు. ఆదివారం బాయిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి జనార్ధన్ ఆర్థిక సహాయంతో డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భవతులకు, బాలింతలకు, రోగులకు రొట్టె, పప్పు, గుడ్డు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి ఈ పౌష్టికాహారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దాతల సహకారంతో ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దాతలు మరింత సహకారం అందిస్తే సేవ కొనసాగించేందుకు ముందుకు వెళతానన్నారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్, హోసన్న వృద్ధాశ్రమం సూపర్వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్

శ్రీశ్రీ కవిత విప్లవాత్మకం

- అరసం జిల్లా అధ్యక్షులు ముర్తుజా

ప్రజాశక్తి - నంద్యాల

శ్రీశ్రీ కవిత అభ్యుదయాత్మకం, విప్లవాత్మకం, ధ్వని ప్రధానమైనదని అరసం జిల్లా కన్వీనర్ ముర్తుజా తెలిపారు. ఆదివారం స్థానిక నూనెపల్లిలోని భగత్ సింగ్ జన చైతన్య గ్రంథాలయంలో అరసం ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సభకు అరసం జిల్లా కన్వీనర్ ఎస్.ముర్తుజా అధ్యక్షత వహించారు. ప్రముఖ న్యాయవాది, సామాజిక సేవా కార్యకర్త బి. శంకరయ్య, ప్రముఖ రచయిత కళా మురళి, సీనియర్ పాత్రికేయులు, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి మాదాల శ్రీనివాసులు, సాహితీవేత్త కళామురళిలు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ముర్తుజా మాట్లాడుతూ ఒక వర్గానికే పరిమితమైన కవితను ప్రజల కవితగా మలిచిన ధీరుడు శ్రీశ్రీ అని కొనియాడారు. గురజాడ అప్పారావు జాడ చూపించగా వీరేశలింగం తనను ప్రభావితం చేయగా ప్రజా కవితకు ఉద్యమించి గురజాడ బాటను మరింత విస్తృతపరిచి ప్రజల భాషలో వారి కోసం చక్కని ప్రజా కవిత్వాన్ని శ్రీశ్రీ సృష్టించారని చెప్పారు. ధ్వని ప్రధానమైన కవితకు ఉదాహరణగా నేను సైతం ప్రపంచాగ్నికి అనే కవితను ఉటంకిస్తూ ఇందులో ప్రపంచమంతా బాధలో ఉన్నప్పుడు మనం కూడా ఉలిపికట్టె దారి వేరే దారి అన్నట్టు కాకుండా మనం మన చేయూతను అందించాలని, సమిధలుగా ఆహుతి అవ్వడానికి సైతం వెనుకాడకూడదని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత కళా మురళి మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం అపూర్వమైనదని అన్నారు. బి.శంకరయ్య మాట్లాడుతూ యువకుల కోసం మనం శ్రీశ్రీ పంథాలో పయనించాలని, అటువంటి మార్గాన్ని తప్పకుండా వెతకవలసి ఉందన్నారు. తన వంతుగా అనేక పుస్తకాలతో కూడిన భగత్ సింగ్ జనచైతన్య విజ్ఞాన గ్రంథాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయగలిగానని, యువకులకు నేడిది ఎంతో తోడ్పడుతోందని తెలిపారు. మాదాల శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం ప్రభావశీలమైనదని అన్నారు. రచయిత మహమ్మద్ రఫీ మాట్లాడుతూ శ్రీశ్రీ కవితలను ప్రతి ఒక్కరూ పఠించాలని, పుస్తకాలను చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. రచయిత నీలకంటమాచారి శ్రీశ్రీ అభ్యుదయ సాహిత్యం పై చక్కని కవిత రాసి చదివారు. స్థానిక రామకష్ణ డిగ్రీ కళాశాల లెక్చరర్ బాలరాజు, మాట్లాడుతూ శ్రీశ్రీ మార్గం అనితర సాధ్యమని ఉద్ఘాటించారు. ప్రజా కళాకారులు, పాటల రచయిత బాల హుస్సేని, కళాకారుడు వీరసేన శ్రీశ్రీ అభ్యుదయ కవితలను చక్కగా గానం చేసి శ్రోతలను అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలలో ప్రథమ బహుమతి గోస్పాడు జూనియర్ కళాశాల తెలుగు లెక్చరర్ మద్దిలేటి, ద్వితీయ బహుమతి విశ్రాంత ఉపాధ్యాయులు నీలకంఠమాచారి సాధించారని కన్వీనర్ ముర్తుజా ప్రకటించారు. మిగతా బహుమతులకు అర్హమైన రచనలు రాలేదని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అరసం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ముర్తుజా షేక్, ఉపాధ్యక్షులుగా మద్దిలేటి, కార్యదర్శులుగా పడకండ్ల మురళి, మహమ్మద్ రఫీ, ఉప కార్యదర్శులుగా మహబూబ్ బాషా, పివి రామకృష్ణారెడ్డి, జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా ప్రముఖ రచయిత కళా మురళిని ఎన్నుకున్నారు. తర్వాత రచయిత రఫీ వందన సమర్పణతో కార్యక్రమాన్ని ముగించారు.

పింగళి సూరన శాఖా గ్రంథాలయంలో..

జనజీవన పదప్రయోగాలతో యువతకు చక్కని మార్గనిర్దేశం చేసిన మహాకవి శ్రీశ్రీ ఆధునిక సాహిత్యానికి యుగకర్తగా నిలిచారని సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. శ్రీశ్రీ జయంతి వేడుకలను పింగళి సూరన శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, పాఠకులు పూలమాల వేసి ఘనంగా నీరాజనాలర్పించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డా.నాగరాజు మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని ముందుకు నడిపించే దృక్పథంతో సాగాలన్నారు. అరసం అధ్యక్షులు ముర్తుజా శ్రీశ్రీ ఆదర్శంతో వర్ధమాన కవులు యువతకు కర్తవ్యబోధ చేయాలన్నారు. అనంతరం శ్రీశ్రీ సాహిత్యం–సామాజిక చైతన్యం అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి కార్యదర్శి మాదాల శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక పట్టణ కార్యదర్శి పి గోపాల్ , రామరాజు,హుస్సేన్ రెడ్డి, కవులు రమణమూర్తి, మాబుబాష, నరేంద్ర, మద్దిలేటి , తెలుగు పండితులు అన్నెం శ్రీనివాసరెడ్డి, డా.నీలం వెంకటేశ్వర్లు, శేషఫణి, లలిత సరస్వతి, గ్రంథాలయాధికారులు శ్రీధర్ , మధులు, పాల్గొన్నారు. **డోన్ :** శ్రీశ్రీ జయంతి వేడుకలను పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పద్మావతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న దృశ్యం

మేడేకు ఆత్మకూరు పట్టణం ముస్తాబు

ప్రజాశక్తి - ఆత్మకూర్ : ప్రపంచ కార్మిక దినోత్సవ సందర్భంగా ఆత్మకూరు పట్టణం మేడే వేడుకలకు ముస్తాబు అయింది. ఆదివారం పట్టణంలోని పలు ఆటో సెంటర్లు, ప్రధాన కూడలిలో, సిపిఎం ఆఫీసు వద్ద, కర్నూలు-గుంటూరు రహదారి, గౌడ్ సెంటర్ వద్ద, పాత బస్టాండ్ తదితర ప్రాంతాలలో ఎర్రజెండా తోరణాలతో ఎరుపు మయం అయింది. సోమవారం మేడే కార్యక్రమాన్ని ఉదయం నుండే ప్రారంభిస్తున్నట్లు సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ తెలిపారు.

నేడు వినూత్న రీతిలో 'స్పందన' : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న రీతిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏ విభాగానికి సంబంధించి అధికంగా స్పందన ఫిర్యాదులు వస్తున్నాయో ఆయా విభాగాల అధికారులు ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటు చేసుకుని అర్జీదారుని సమస్యను క్షుణ్ణంగా అర్థం చేసుకొని అధికారులు లేదా సంబంధిత సిబ్బంది నేరుగా జిల్లా కలెక్టర్ దగ్గరికి తీసుకెళ్లి సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించేందుకు ప్రయోగాత్మకంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో సమయం వృధా కాకుండా ఫిర్యాదుదారుని సమస్యను పూర్తిగా విని సత్వర పరిష్కారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు.స్పందన కార్యక్రమానికి నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరుకావాలని తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఆర్జితసేవలు బుక్ చేసుకోండి

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునేందుకు వచ్చే వారు శ్రీశైలదేవస్థానం www.srisailadevasthanam.org అధికారిక వెబ్‌సైట్ ద్వారా అన్ని ఆర్జితసేవలు, స్పర్శదర్శనం టిక్కెట్‌లను బుక్ చేసుకోవాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టిక్కెట్లను బుక్ చేసుకున్న వారు ఫొటో ఐడి ప్రూఫ్, టికెట్ హార్డ్ కాపీతో రావాలని, ఆర్జిత సేవా, స్పర్శ దర్శనం టిక్కెట్‌లకు కరెంట్ బుకింగ్ కౌంటర్లు లేవని తెలిపారు. కరెంట్ బుకింగ్ కౌంటర్ల ద్వారా ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనం మాత్రమే అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఉచిత, స్పర్శన దర్శనం ప్రతి మంగళవారం నుండి శుక్రవారం వరకు కొనసాగుతుందని (మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 వరకు) పేర్కొన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్, డిప్యూటీ కలెక్టర్లు, దేవదాయశాఖ అధికారుల లేఖలను రెండు రోజుల ముందు ఆమోదించిన లెటర్ ప్యాడ్‌లపై దేవస్థానం ప్రోటోకాల్ లేఖలను అంగీకరిస్తుందని, ఇతర లెటర్ ప్యాడ్‌లు, సందేశాలు అంగీకరించబడవని తెలిపారు. లెటర్ ప్యాడ్‌లు ఈ మెయిల్ ఐడి Whatsapp protocol@ srisaila devasthanam. org లేదా 9160016215లో Whatsappకి పంపగలరని సూచించారు. ఇతర నకిలీ వెబ్సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవద్దని, నకిలీ వెబ్‌సైట్లతో జాగ్రత్త వహించాలని సూచించారు.

రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దు : ఎఎస్ఐ

ప్రజాశక్తి - రుద్రవరం

రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందువల్ల ధాన్యంను రోడ్లపై ఆరబెట్టరాదని ఏఎస్ఐ బాలన్న రైతులకు సూచించారు. సిరివెళ్ల సిఐ చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని నరసాపురం, ముత్తలూరు, ఆలమూరు ,హరినగరం, ఎల్లావత్తుల తదితర గ్రామాలలో రైతులు వరి, మొక్కజొన్న పంటలను ఆరబెట్టే రైతుల దగ్గరకు వెళ్లి రోడ్లపై ధాన్యం పోయడం వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ మాట్లాడుతూ ధాన్యం రోడ్లపై ఆరబెట్టడం వల్ల వాహనదారులు పంటలను గుర్తించలేక అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అందువల్ల రైతులు పంటనులను వారి పొలాలలోనే ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు.



దాతలకు జ్ఞాపికను అందజేస్తున్న ఇఒ లవన్న తదితరులు

అన్న ప్రసాద పథకానికి రూ. 5 లక్షలు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దేవస్థానం క్షేత్రాన్ని సందర్శించే యాత్రికులకు, భక్తులకు నిత్యం అందిస్తున్న నిత్య అన్నదాన ప్రసాద పథకానికి ఆదివారం వెంకటగిరికి చెందిన శీలా సాయి తేజ కుటుంబ సమేతంగా కలిసి రూ.5,01,116 విరాళంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్నకు అందజేశారు. దాతలు ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం విరాళాన్ని ఇఒకు అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు శేష వస్త్రాలను, ప్రసాదాలను, సంబంధిత ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ ఫణిదర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో కెజిబివి 97 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాలలోని వైఎస్ఆర్ నగర్ లో ఉన్న కేజీబీవీ మైనార్టీ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సరంలో 91 శాతం, ద్వితీయ సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత పొంది అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరంలో సి. చంద్రకళ 481, ద్వితీయ సంవత్సరంలో వి.లక్ష్మి మైథిలి 975 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఆర్సియా 475, నియలోఫర్ 473, సోనియా 469, సుజిత 458, శివ లింగమ్మ 449 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎన్. మనీషా 943, పి.మున్ని 935, షాహినా 924, రజియాభీ 924, నిమ్రా 923, ఎస్.మున్ని 922, సల్మా 898, గీత అహల్య 895 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ హెప్సిబా తెలిపారు.

నేటి నుండి పాఠశాలలకు సెలవులు

ప్రజాశక్తి - పగిడ్యాల : నేటి నుండి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. కరోనా సమయంలో నాడు పాఠశాలలో సెలవులు ప్రారంభాలు వెనకముందు కొనసాగాయి. ఈ సంవత్సరం నుంచి గతంలో ఎలా ఉండేదో ఆ విధంగా సెలవులు ప్రకటించింది ప్రభుత్వం. నేటి నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు సెలవులు ఉంటాయి. జూన్ 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతాయి. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులకు మూడు రోజులపాటు ప్రత్యేక క్లాసులు తీసుకోవాలని లెక్చరర్లకు ప్రభుత్వం ఆదేశించింది. మండలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాల, ఆదర్శ జూనియర్ కళాశాల, కస్తూర్బా జూనియర్ కళాశాలలో ఉన్నాయన్నాయి. అయితే ఈ కళాశాలలో సుదూర గ్రామాల విద్యార్థులు విద్యను అభ్యసిస్తుంటారు. మూడు రోజులు ప్రత్యేక క్లాసులు తీసుకోవాలంటే వాళ్లకు ఎలాంటి వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. స్థానిక విద్యార్థులైతే ఉదయం వచ్చి సాయంత్రం వెళ్తారు. దూరప్రాంతాల విద్యార్థులు ఇక్కడ మూడు రోజులు ఎలా ఉంటారని, వారికి అన్ని వసతులు కల్పిస్తే ఉండే అవకాశం ఉంటుంది. లేకపోతే ఇబ్బందులు పడే అవకాశం ఉందని విద్యార్థినిలు పేర్కొంటున్నారు. ఇక్కడ ఉండే రోజులు అన్ని వసతులు కల్పిస్తే బాగుంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు.



1998 డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

1998 డిఎస్‌సి అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని 98 డీఎస్సీ ఉద్యోగ సాధన సమితి రాష్ట్ర కో-కన్వీనర్ ఈపనగండ్ల శ్రీనివాసులు యాదవ్, కర్నూలు ఉమ్మడి జిల్లా కన్వీనర్ రంగస్వామిలు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1998 డిఎస్‌సి అభ్యర్థులు 544 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నారని, ఇందులో కేవలం 209 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఇందులో కూడా ఎలాంటి రోస్టర్-కం-మెరిట్ పాటించలేదని విమర్శించారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులు, మహిళలు పూర్తిగా నష్టపోయారన్నారు. 209 పోస్టులలో కూడా 169 పోస్టులు ఓసి వర్గానికి ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇప్పటికైనా జిల్లాలో మిగిలిపోయిన 335 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి వారి జీవితాలను నిలబెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ నెల 2న కర్నూల్ కలెక్టర్ ఆఫీస్ వద్ద నిర్వహించే సదస్సుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యోగాలు వచ్చిన, మిగిలిపోయిన అభ్యర్థులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 98 డీఎస్సీ అభ్యర్థులు చెన్న కృష్ణయ్య, రాజు, చెన్నయ్య, సుందరం, కృష్ణయ్య, సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్ఎండి.ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో నడుస్తున్నది జగన్ రాక్షస పాలన అని, కోడికత్తి కేసు, బాబాయ్ వివేకా హత్య ద్వారా అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి పాలన అవినీతిమయం, నేరాలమయంగా ఉందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి, ఎమ్మెల్సీ ఎన్ఎండి ఫరూక్ ఆరోపించారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని శోభా ఫంక్షన్ హాల్లో నంద్యాల పార్లమెంటరీ స్థాయి టిడిపి నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు గౌరు వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూమా బ్రహ్మానందరెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, గౌరు చరితారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని, నవరత్నాలంటూ నవ మోసాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బాబాయ్‌ని చంపి అది నరకాసుర హత్య అని చెప్పిన జగన్, సిబిఐ దర్యాప్తు కోరాడని, అధికారంలోకి వచ్చిన వెంటనే సిబిఐ దర్యాప్తును ఉపసంహరించడం ఆయన ద్వంద్వనీతి పాలనకు అద్దం పడుతోందన్నారు. కోడి కత్తి కేసు కూడా ఎన్నికల కోసం ఆడిన డ్రామానే అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఎనిమిది గంటలకు ఒక మహిళ అత్యాచారానికి గురవుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న జగన్ ఎటువంటి ఉద్యోగాలు ఇవ్వలేదని, అలాగే దేశంలో ఎక్కడ గంజాయి కేసు దొరికినా వాటి మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. బాబాయ్ హత్య వైఎస్ఆర్సిపి హత్య అని, జగన్ తన సంపదను ఎలా సంపాదించాడో సిబిఐ 4300 కోట్ల ఆస్తులుగా వెలకట్టిందని, కానీ జగన్ తన ఎన్నికల అఫిడవిట్‌లో 510 కోట్ల ఆస్తులు మాత్రమే ఉన్నట్లు చూపాడన్నారు. రాష్ట్రంలో భూ మాఫియా, లిక్కర్ మాఫియా, మైనింగ్ మాఫియా పెట్రేగిపోతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌కు చెల్లి చీటీ పెట్టి టిడిపిని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలంతా ఎదురుచూస్తున్నారని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అభివృద్ధి శూన్యం : కాంగ్రెస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఈరోజు వరకు అభివృద్ధి శూన్యమని పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు ఆరోపించారు. ఆదివారం నంద్యాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్యతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం నంద్యాలను ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. నంద్యాల అభివృద్ధికి నోచుకోకుండా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని ఈరోజు ఉన్న నాయకులు తామే చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇంకా అప్పటికి జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టలేదని, అలాంటప్పుడు ఈ వైసిపి నాయకులు ఎక్కడ అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నంద్యాలకు వచ్చిన సందర్భంలో బైపాస్ రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్డు హామీలు ఇచ్చారని, ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఈ విషయాల మీద స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎపిసిసి అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చింతల మోహన్ రావు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - గడివేముల

ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. చదువుకునే రోజుల్లో చేసే అల్లర్లు వారితో కలిసి ఆడిన ఆటలు మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ 40 సంవత్సరాల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఆదివారం ఆనందంగా గడిపారు. గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979 నుండి 1984వ సంవత్సరంలో చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. అప్పట్లో వారికి విద్య బోధన చేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించి పాత బస్టాండ్ నుండి జిల్లా పరిషత్ పాఠశాల వరకు మేళ తాళాలతో ఊరేగించారు. 40 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు కలుసుకొని ఆప్యాయంగా పలకరిస్తూ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులైన సీతమ్మ, తిరువెంగళయ్య, సుబ్బన్న, చంద్రశేఖర్ రెడ్డి, నాగిరెడ్డిలకు ఘనంగా సత్కరించారు. పూర్వపు విద్యార్థులు మాట్లాడుతూ తమలాంటి ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థాయిలో ఉంచిన గురువులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు క్రీడలకు ఉపయోగపడే పరికరాలను అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు ఆర్.బిచంద్రశేఖర్ రెడ్డి, మధుసూదన్ గుప్తా, కాటంరాజు, డీలర్ శ్రీనివాసులు, బిల్కల గూడూరు శ్రీనివాసులు, గంగాధర్ రెడ్డి, రమణారెడ్డి, జమాల్ బాషా, వెంకటేశ్వర్ రెడ్డి, సతీష్ కుమార్, నాగేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వైసిపి పతనం మొదలైంది : మాజీ ఎమ్మెల్యే

- 33 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రాష్ట్రంలో జగన్ రెడ్డికి పరిపాలించే అర్హత లేదని, వైసిపి పతనం మొదలైందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సమీప బంధువు యాతం సత్యనారాయణరెడ్డి, నాగార్జున రెడ్డి, సర్పంచి తనయుడు హాజీవలి, ఆదినారాయణరెడ్డిలు టిడిపి యువ నాయకుడు హుస్సేన్ రెడ్డి ఆధ్వర్యంలో 33 కుటుంబాలు ఆదివారం మాజీ ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువా టిడిపిలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరూ ఎక్కువగా నాపరాతిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ఆదుకోవాల్సిన ప్రభుత్వమే భారాలు వేయడం దారుణమన్నారు. గత ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాయల్టీ చెక్ పోస్ట్ లేకుండా చేస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. నాడు టిడిపి ప్రభుత్వంలో డిఎంఎఫ్ రాయల్టీ తగ్గించామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మూల రామేశ్వర్ రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి రెడ్డి, విఆర్ లక్ష్మిరెడ్డి, నంద్యాల ప్రసాద్, ఉమ్మాయి పల్లె రామ్మోహన్ నాయక్, కోటపాడు శివరామిరెడ్డి, కెపి వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసిపి నుండి టిడిపిలోకి చేరిన వారితో ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

బ్రిడ్జిని నిర్మించకపోతే దీక్ష చేపడతాం : బిఎస్‌పి

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం కోల్స్ ఆనందపురం గ్రామానికి బ్రిడ్జిని నిర్మించాలని, లేనిపక్షంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని బహుజన సమాజ్ పార్టీ నందికొట్కూర్ అసెంబ్లీ ఇన్చార్జి ఎల్.స్వాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం కోల్స్ అనందపురం ప్రజలతో కలిసి బిఎస్‌పి నాయకులు బ్రిడ్జి దిమ్మల కింద ఉరి వేసుకుని వినూత్న నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసి కెనాల్‌పై అప్పట్లో నిర్మించిన వారాదులు కాలక్రమేనా శిథిలావస్థకు చేరుకున్నాయని, ప్రభుత్వాలు వాటి స్థానంలో కొత్త బ్రిడ్జిలు నిర్మించాయని, కానీ కోల్స్ ఆనందపురం గ్రామం దగ్గర నిర్మించిన వారాధి శిథిలావస్థకు చేరుకొని సైడ్‌కు గోడలు లేనందున పశువులు కెనాల్‌లో పడి చనిపోయాయని తెలిపారు. ఎన్నో ప్రమాదాలు జరిగినా బ్రిడ్జి నిర్మించలేదన్నారు. రైతులు పండించిన పంటలు కొనుగోలు చేయాలంటే వ్యాపారస్తులు బ్రిడ్జి లేక ముందుకు రావడం లేదన్నారు. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త బ్రిడ్జి కోసం నిధులు కేటాయిస్తే గుత్తేదారుడు దిమ్మెలు కట్టి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయకుండా వదిలేశారని అన్నారు. నాటి నుండి ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు బ్రిడ్జిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి కోల్స్ ఆనందపురానికి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని, లేనిపక్షంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దినకర్, ప్రవీణ్, ఏలియజర్, రత్నమయ్య, చంద్రపాల్, జాన్, దిలీప్, చక్రవర్తి, బి.ప్రవీణ్, విజయ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్తులు



ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

కాలజ్ఞాన తత్వవేత్త, శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 330వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం పట్టణంలోని రవ్వలకొండ శ్రీ పోతులూరి వీరప్పయ్య స్వామి మఠంలో, చింతమానుమఠంలో, నంద్యాల రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి నేలమఠంలో వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకస్రోత్తర శతమాన పూజలు, మహాప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నేలమఠం ఆలయ ప్రధాన అర్చకుడు మఠం శ్రీనివాసులు ఆచారి, చేతన్ వెంకటాచారిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. **యనకండ్లలో :** మండలంలోని యనకండ్ల గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, మండల ట్రెజరర్ ఖాదర్ బాషా, నాయకులు బొబ్బల బాల తిమ్మారెడ్డి, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** స్థానిక విశ్వరూప పారిశ్రామిక నగర్ కాళికామాత దేవాలయంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు ప్రముఖ శిల్పి, దురగడ్డ రవీంద్రచారి ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన కార్యక్రమాన్నిఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌ఆచారి నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ ఆచారి, కోశాధికారి మోహనాచారి, ప్రధాన కార్యదర్శి చిన్న పుల్లయ్యాచారి, సభ్యులు శ్రీనివాసులు ఆచారి, బాణాల పుల్లయ్య ఆచారి, బాల ఆంజనేయులు ఆచారి, కష్ణమాచారి, రామభద్రయ్య ఆచారి, రవికుమార్ ఆచారి, పాపయ్య ఆచారి, యువజన సంఘం సభ్యులు హరికృష్ణ ఆచారి, పృధ్వి ఆచారి, వెంకటేష్ ఆచారి, భక్తులు పాల్గొన్నారు.



మఠంలో యజ్ఞం చేస్తున్న దృశ్యం

టిడిపి హయాంలోనే నంద్యాల అభివృద్ధి

మినీ యువగళం కార్యక్రమంలో భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

త్వరలో నంద్యాల జిల్లాకు యువ గళం పాదయాత్ర రానుందని, యువత భారీ ఎత్తున సంఘీభావం తెలుపుతూ విజయవంతంగా నడిపించాలని టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి కోరారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని 28, 33వ వార్డులలో మినీ యువ గళం కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని యువత కోసం చరిత్రలో ఎవరు చేయని విధంగా ఒక మేనిఫెస్టోను తయారుచేసిన మన నాయకుడు నారా లోకేష్ అన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు సమయానికి విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వచ్చేదని, వైసిపీ ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. చేతగాని వైసిపి ప్రభుత్వమని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్న ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. యువత ఉద్యోగాలు లేక దాదాపు 300 మంది ఆత్మహత్యలు చేసుకున్నా ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శలు చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే నారా చంద్రబాబు నాయుడు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. నంద్యాలలో అభివద్ధి జరిగిందంటే ఒక టిడిపి ప్రభుత్వంతోనే, అది భూమా కుటుంబంతోనే సాధ్యమైందన్నారు. నాలుగు రోజుల కిందట నంద్యాల సండే ఎమ్మెల్యే గాలి మాటలు మాట్లాడుతున్నారని, తాను ఒక ఛాలెంజ్ చేశానని, ఇంతవరకు స్పందించలేక సమాధానం చెప్పలేని ఈ గాలి మాటల ఎమ్మెల్యే అంటూ శిల్పా రవిపై విమర్శలు గుప్పించారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని, ఈసారి టిడిపికి అవకాశం కల్పిస్తే మళ్లీ నంద్యాల రూపురేఖలు మారుస్తామని, డ్రెయినేజీ, తాగునీరు, సిసి రోడ్ల సమస్యలను లేకుండా చేస్తామని ప్రజలకు భూమా హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మినీ యువగళం కార్యక్రమంలో భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి





అవగాహన కల్పిస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పద్మావతమ్మ అధ్యక్షతన కెరీర్ గైడెన్స్‌పై 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఏఐఎస్ఈసిటి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. వొకేషనల్ ట్రైనీ మహేష్, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డిలు మాట్లాడుతూ 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు భవిష్యత్తులో ఏ కోర్సులో ఎలాంటి ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఇంటర్, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ కోర్సులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకటరమణ, సుబ్బారాయుడు, అల్లిపీరా, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని వేంపెంట గ్రామ సమీపంలో శివ నాయక్ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు రెండు గేదెలు తగలడంతో షాక్ కొట్టి చనిపోయినట్లు పశువైద్యాధికారి భాస్కర్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గుండాలనట్టు గ్రామానికి చెందిన రైతు ఏసేపుకు చెందిన రెండు గేదెలు విద్యుత్ ట్రాన్స్‌ఫారానికి తాకి మృతి చెందాయన్నారు. గేదెల విలువ సుమారు లక్ష ఇరవై వేలు ఉంటుందని తెలిపారు. చనిపోయిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు.

వైసిపి పాలనకు చరమగీతం : భూమా

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలోని ప్రజలందరూ వైసిపి పాలనకు చరమగీతం పాడాలని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక అజీమ్ బ్రిలియంట్ పాఠశాలలో టిడిపి నాయకులు కందుకూరి హుస్సేన్ భాష కూతురి నిఖా కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జరగబోయే యువగళం పాదయాత్రలో యువకులు ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్అన్సర్ భాష, మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, మండల ప్రచార కార్యదర్శి ముల్లా గఫార్, తెలుగు యువత అధ్యక్షులు మబూలాల్, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహుడు, వాణిజ్య శాఖ నాయకులు ఆకుల ఇర్షాద్, మండల ప్రధాన కార్యదర్శి ముల్లా ఆలంసాగారి హనీఫ్, కొలిమి సోను, నాయకులు కొలిమి మాబు షరీఫ్, బషీర్, చాంద్ బాషా, మదర్ సాహెబ్, నాగూర్, రఫీ హుస్సేన్ బాషాలు పాల్గొన్నారు.



వివాహ వేడుకలో భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

నేటి నుండి జూన్ 11 వరకు సెలవులు : ఎంఇఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు నేటి నుండి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఎంఇఒ బ్రహ్మం నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో ప్రైవేట్ పాఠశాలలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 2022-23 ఏప్రిల్ నాటికి శ్రీలక్ష్మి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, యూనివర్సల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు గుర్తింపు పూర్తి అయిందని, ఈ పాఠశాలలో గుర్తింపు రద్దయిందన్నారు. కావున తల్లిదండ్రులు పిల్లలను అందులో చేర్పించవద్దని స్పష్టం చేశారు.

స్వామి వారికి నగలు బహూకరణ

ప్రజాశక్తి - బేతంచెర్ల : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి వారికి కర్నూలుకి చెందిన గొర్ల చంద్రశేఖర్, రాజేశ్వరి దంపతులు రూ.1.20 లక్షలు విలువ చేసే 1 కేజీ 500 గ్రాముల వెండి నగల హారాన్ని, మహాలక్ష్మి అమ్మవారికి వెండి పాదాలను ఆదివారం బహూకరించారు. ఆలయ ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడులకు అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి దర్శనం తర్వాత తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ప్రతిష్ఠ వార్షికోత్సవం

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని చింతలచెరువు గ్రామంలో వెలసిన రామాలయంలో ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు కైప నరసింహశాస్త్రి వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు.ఆళ్ళగడ్డ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ భూమా కిషోర్ రెడ్డి గ్రామానికి చేరుకొని ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాచర్ల హెచ్‌ఎంకు విశిష్ట శతక రచయిత బహుమతి

ప్రజాశక్తి - ప్యాపిలి : సిపి బ్రౌన్ సేవా సమితి, స్వాతంత్ర్య సమరయోధుడు ఇడమకంటి బ్రహ్మారెడ్డి ధార్మికసంఘం బెంగళూరు వారు సంయుక్తంగా నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన శతక పద్య రచన పోటీలలో మండలానికి చెందిన రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సురేశ్ బాబుకు విశిష్ట శతక రచయిత బహుమతి లభించింది. బహుమతి కింద ఎన్టీఆర్ మహాశతకం పుస్తకంలో ఈ పద్యాలను ప్రచురించడంతో పాటు పది వేల రూపాయల నగదు బహుమతిని మే 27న నిర్వహించే సభలో ప్రముఖుల చేతుల మీదుగా అందజేయనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడికి ఉపాధ్యాయులకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం అందరికీ అవసరం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం ఎంతో అవసరమని డాక్టర్ రాంగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ శివార్లలోని శిల్ప నేచర్ వద్ద రోటరీ ఆరోగ్య వేదిక కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రాంగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ జోష్ హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అల్లగడ్డ మున్సిపల్ చైర్మన్ రామలింగారెడ్డి హాజరయ్యారు. ఆళ్లగడ్డ జోష్ కార్యక్రమానికి పట్టణంలోని పలు విద్యాలయాలకు చెందిన విద్యార్థినిలు, పుర ప్రముఖులు హాజరై ఏరోబిక్స్ క్లాపింగ్ థెరపీ ఎక్సర్సైజులను నిపుణులైన వారి సమక్షంలో నిర్వహించారు. ప్రతి ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పట్టణంలోని ప్రతి ఒక్కరూ ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో పాల్గొని తమ ఆరోగ్యాలను బాగు చేసుకోవాలని డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామలింగారెడ్డిలు కోరారు.